# అంతర్యుద్ధం

**మిస్ జీనా**

(గత సంచిక తరువాయి)

## 2

మధు ఆశ్చర్యంగా ఆమెవంక చూశాడు.

"చూడండి! నేను మీరంత ఉన్నతురాలిని కాకపోవచ్చు. నా హృదయం మీ హృదయం అంత పవిత్రమైనది కాకపోవచ్చు. కానీ... నేనూ ఒక మనిషిని. నాకూ హృదయమున్నది. నా మనసు వ్యథ పొందుతున్నమాట నిజమే. ఈ అంతర్యుద్ధంతో నేను నాశనమైతే అవుతాను. కానీ...మీ సహాయం మాత్రం కోరను. మీ సహాయాన్ని మీరు దయచేసినా అది స్వీకరించే శక్తి నాలో లేదు...ఇంకెప్పుడూ ఈ విషయాన్ని గురించి మాట్లాడకండి."

మధు ఒకసారి బాధగా అమృత ముఖం వంక చూసి వూరుకున్నాడు. ఆరోజు శ్యామ్ రాలేదు. అమృత మనస్సు పరి పరివిధాల పోయింది. పాపం! మళ్ళీ జ్వరం వచ్చిందేమో! అమృతకు దిగులుగా జాలివేసింది. సాయంత్రం దాకా శ్యామ్ కోసం ఎదురుచూస్తూనే వుంది. కానీ శ్యామ్ రాలేదు. ఆరోజు మధు ఇంటికి రాగానే అమృత 'ఇవాళ శ్యామ్ రాలేద'ని చెప్పింది.

మధు "ఒక రోజు రాకపోయినా దానికింత కష్టం కలిగించే మాట అన్నావే. నీది మెత్తని మనస్సు" అన్నాడు.

అమృత మాట్లాడలేదు.

మధు నవ్వి తనలో తను మాట్లాడుకుంటున్నట్టు అన్నాడు:

"ఉండు వెళ్ళి! రేపు వాడిని వెంట బెట్టుకు వస్తాను."

అమృత ఏమీ మాట్లాడలేదు.

"అన్నట్టు అమృతా! శోభ దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది."

"ఏమని?" ఉత్సాహంగా అడిగింది అమృత.

"రేపు రాత్రి మెయిలులో ఇక్కడికి వస్తుందట! ఈ క్రిస్మసు ఇక్కడే వుంటానని రాసింది."

అమృత సంతోషంతో పొంగిపోయింది. ఆమెకు శోభంటే చాలా యిష్టం. శోభ చాలా సరదా మనిషి. శోభకు కూడా అక్కంటే చాలా యిష్టం.

ఆ రాత్రంతా అమృతకు శోభను గురించి ఆలోచించడంతోనే గడిచిపోయింది.

మరునాడు శ్యామ్ వచ్చాడు.

"నిన్న రాలేదేం?" మామూలు ప్రశ్నలతోనే అడిగింది అమృత.

శ్యామ్ సమాధానం చెప్పలేక నవ్వాడు.

"నీకు జ్వరం వచ్చిందనుకున్నాను కిశోర్!"

"కొద్దిగా వచ్చింది. కానీ నా జ్వరాన్ని లక్ష్యపెట్టే అలవాటు నాకు లేదు."

"మరి ఏం లక్ష్యపెట్టావ్?"

"నాకు 104 డిగ్రీల జ్వరం వున్నా నాకేమీ బాధ వుండదు. కాని నా మనసుకే కొంచెం కష్టం కలిగినా నేను సహించలేను." అమృత నవ్వి వూరుకొంది. ఈ రకమైన సంభాషణ ఇంకా పొడిగించటానికి అమృతకిష్టం లేదు. సంభాషణ మార్చాలని అంది.

"ఇవాళ రాత్రి మా చెల్లెలు శోభ వస్తుంది."

"నీకు చెల్లెలుందా?"

"ఒకతే [illegible]!" అమృత నవ్వింది.

"నువ్వు నిజంగా అమృతమూర్తివే!" ఆమె ముఖంవంక చూస్తూ అన్నాడు శ్యామ్.

అమృత కనుబొమలు చిట్లించింది.

"ఇదిగో! ఇంకెప్పుడైనా ఇట్లా మాట్లాడావంటే..." శ్యామ్ బెదురుగా ఆమె కళ్ళలోకి చూశాడు.

"క్షమించు అమృతా! నేనేమీ చెడ ఉద్దేశంతో అనలేదు. నువ్వు నా తప్పును క్షమించి నన్ను స్నేహంగా చూస్తున్నావని అన్నాను" చాలా సిగ్గుతో అన్నాడు.

అమృత పకపక నవ్వింది.

"పిచ్చి కిశోర్!" జాలిగా అతని కళ్ళలోకి చూస్తూ అంది. శ్యామ్ ఏం సమాధానం చెప్పాలో తెలియక తను కూడా నవ్వేశాడు.

ఆ రాత్రి మధు స్టేషనుకెళ్ళి శోభను తీసుకొచ్చాడు. అమృత సంతోషం వర్ణించ తరంగాదు. అమృతను చూసి శోభ నవ్వింది.

"రోజు రోజుకూ చిన్నపిల్లలై పోతున్నావక్కయ్యా! బావగారు నిన్ను మితిమీరిన గారాబం చేస్తున్నట్టున్నారు."

"ఆ మాట నిజమే శోభా! మీ బావగారి గారాబం విపరీతంగానే వుంది" అమృత నవ్వింది.

మరునాడు శ్యామ్ రాగానే అమృత శోభను పరిచయం చేసింది.

"ఇదిగో నా చెల్లెలు కిశోర్! శోభారాణి. ఎమ్. ఎ. మొదటి సంవత్సరం చదువుతోంది."

శోభ శ్యామ్‌కు నమస్కరించింది. శ్యామ్ ప్రతి నమస్కారం చేశాడు.

"ఇతని అసలు పేరు శ్యామ్ శోభా! కానీ నేను 'కిశోర్' అని పెట్టాను."

శోభ ఆశ్చర్యంగా అక్కవంక చూసింది.

"ఎందుకని?"

అమృత నవ్వింది.

"కొన్ని రోజులు పరిచయమైతే నీకే తెలుస్తుంది."

శోభ శ్యామ్ ముఖం వంక చూసింది. ఈ సంభాషణ శ్యామ్‌కు చాలా సిగ్గుగా వుంది. శోభ అతని వంక చూసి నవ్వింది.

"మీరేం చదువుకున్నారూ?"

"ఎమ్. ఎ. పాసయ్యాను" మెల్లగా అన్నాడు శ్యామ్.

"ఫస్టు క్లాసులో!" అందించింది అమృత.

"అయితే నువ్వు 'కిశోర్' అని పేరెందుకు పెట్టావక్కయ్యా!"

"నీకే తెలుస్తుంది. నేనేం చెప్పను."

అమృత నవ్వింది.

"మీ 'సబ్జక్టు' ఏమిటండీ?" శోభ అనేక విధమైన ఆశ్చర్యంతో ప్రశ్నించింది.

"లెక్కలు."

శోభ ముఖం సంతోషంతో వికసించింది.

"నాదీ అదే! అయితే నాకీ పాడు లెక్కల్తో మతి పోతూందండీ! నేనిక్కడున్నంత కాలం నాకు కొంచెం సాయం చేయగలరా?"

"ఆ!" నిర్లక్ష్యంగా అన్నాడు శ్యామ్.

ఇంతలో అమృత అడ్డు తగిలింది.

"నీకు పుణ్యముంటుంది శోభా! ఆ పాడు లెక్కల గోల నా ఎదురుగా ఎత్తకు. నాకు తలనొప్పి. నీకంతగా కావాలంటే తరువాత శ్యామ్ ఇంటికి వెళ్ళుదువు గానిలే."

శోభ అక్కకేసి వూరుకుంది.

"మరి మీరు మీ పుస్తకాలు తీసుకు వస్తారా? నా పుస్తకాలు నా దగ్గిర లేవు." శోభకేసి చూస్తూ అన్నాడు శ్యామ్

"ఓ! తీసుకురావద్దనుకుంటూనే అదృష్టవశాత్తు తీసుకొచ్చాను."

ఆ రోజు సాయంత్రం శోభ శ్యామ్‌తో అతని రూములోకి వెళ్ళింది. శ్యామ్ [illegible]



"ఏం రాస్తున్నారు?" అన్నది శోభ

తాళం తీయగానే శోభ ఆశ్చర్యంగా గుమ్మం దగ్గరనే నిలిచిపోయింది. ఆ 'రూం' అనుకోవాలో లేకపోతే ఏదో సామానుకొట్టు అనుకోవాలో తెలియలేదు.

లోపలికి వస్తూ నవ్వుతూ అంది శోభ.

"మీ రూము నింతకంటే మురికిగా వుంచటానికేం వుపాయం లేదా?"

"మీరు హేళన చేస్తున్నారు కదూ! ఏం చేయమంటారు?"

"ఏమని?"

"ఈ సామానులన్నీ ఇలా చిందరగందరగా పడివుండటం చూస్తే నాకూ చికాకే! అట్లాంటప్పుడు ఏం చేస్తానో తెలుసా?.... ఈ గది మధ్య ఒక పడకకుర్చీ వాల్చుకుని పడుకుని కళ్ళు మూసుకుంటాను."

"అదేమిటి?" శోభ ఆశ్చర్యంతో నవ్వుతూ అంది.

"ఉండండి....పూర్తిగా వినండి...అప్పుడేమనుకుంటానంటే....ఈ సామానంతా ఎక్కడిది అక్కడ సర్దేస్తాను. ఇల్లంతా చాలా నీట్ గా వుంచుతాను. గది మధ్యలో టేబుల్ మీద చక్కని ఫ్లవర్ వాజ్ పెట్టి అందులో అందమైన పువ్వులుంచుతాను. నా స్నేహితులంతా వచ్చి "అబ్బా! నీ గది ఎంత అందంగా వుంచావురా!" అని నన్ను తెగ పొగుడుతారు ....కళ్ళు తెరుస్తాను. చుట్టూ చూస్తాను. గదంతా అసహ్యంగా వుంటుంది. అప్పుడు వికారపుబుద్ధి కలిగి తాళంవేసి ఏ స్నేహితుడింటికో పోతాను." శోభ పకపక నవ్వింది. శ్యామ్ కూడా నవ్వి,

"మీరు వస్తారని తెలిస్తే ఎలాగో సర్దేవాడిని" అన్నాడు. శోభ నవ్వుతూనే "కలలోనా?" అని తన పుస్తకాలు టేబుల్ మీద పెట్టి గదంతా పది నిముషాలలో సర్దేసింది. శ్యామ్ ఒక కుర్చీలో కూర్చుని ఆమె చేసేదంతా చూస్తున్నాడు. ఆమెకు సాయం చెయ్యాలని వున్నా అతనిలోకి రాలేదు. శోభ గదంతా శుభ్రంచేసిన తరువాత ఆమెవంక చూస్తూ "చాలా చక్కగా సర్దారండి! ఇట్లాంటివాళ్ళు నా దగ్గర ఎప్పుడూ వుంటే బాగుండును." అన్నాడు.

"అవేం మాటలూ!" తీక్ష్ణంగా అంది శోభ.

శ్యామ్ వులికిపడ్డాడు. ఆమె కళ్ళలోకి దీనంగా చూస్తూ అన్నాడు.

"క్షమించండి. నేను ఏమీ దురుద్దేశంతో అనలేదు. నేను మీకు ముందే చెప్తే మంచిది. నాకే సమయంలో ఎవరితో ఎట్లా మాట్లాడాలో చిన్నగా తెలియదు. దయచేసి నన్ను పొరపాటుగా అపార్థం చేసుకోకండి. నాలో ఏ దురుద్దేశమూ వుండదు."

శోభకు నవ్వు వచ్చింది.

ఇంటికి రాగానే అమృతతో అంది.

"నా వ్యతనికి 'కిశోర్' అని పేరెందుకు పెట్టారో ఒక్క రోజులోనే అర్థమయింది అక్కయ్యా!"

అమృత నవ్వింది.

"మంచివాడు కదూ?"

"చాలా!" శోభ నవ్వుతూ అంది.

అప్రయత్నంగా అమృత నిట్టూర్చింది. శోభ ఆశ్చర్యపోయింది.

"అదేమి టక్కయ్యా!"

అమృత తనను తను అదుపులో పెట్టుకుని చిరునవ్వు నవ్వింది.

"అంత మరీ అమాయకంగా వుంటే లోకంలో వేగలేను. శోభా! అందుకని నిట్టూర్పు విడిచాను."

శోభ అమృత వంక ఆశ్చర్యంగా చూసి ఏం మాట్లాడకుండా అక్కడనుండి వెళ్ళిపోయింది.

మరునాడు శోభ శ్యామ్ ఇంటికి వెళ్ళేటప్పటికి శ్యామ్ ఏదో పాట రాసుకుంటున్నాడు.

"ఏం రాస్తున్నారూ?"

"పాట!"

శోభకు పాటలంటే చికాకు. ఒకోరకంగా బాగానే పాడుతుంది కాని పాటలంటే అంత ఆసక్తి లేదు.

"చూస్తారా?"

"అబ్బ! నాకు విసుగొస్తాయి ఆ భావగీతాలు.... పనీ పాటా లేనివాళ్ళు చేసే పనులు."

శ్యామ్ కొంచెం చిన్నబుచ్చుకున్నాడు. శోభ అది గమనించి నవ్వుతుంది.

"సరేలెండి. ఆ తరువాత చూస్తాను. ముందీ ట్రిగ్నామెట్రీ కానివ్వండి. దీనంత తల తిక్క సబ్జక్టు ఎక్కడా వుండదు."

"తల తిక్కించుకునే ప్రయత్నం తిన్నగా వుండకపోతే ప్రతిదీ తల తిక్కగానే వుంటుంది."

"ఓ కవీ! నాకు కావలసింది కవిత్వం గాదు. లెక్కలు...." శ్యామ్ నవ్వాడు.

"ఏమిటి మీకు కావలసింది? ఏదైనా బుక్ వర్క్ అర్థంగాలేదా? లేకపోతే ఏదైనా...."

"ఏమిటో! అన్ని వర్కులు ఒకలాగే వున్నాయి." విసుగ్గా అంది శోభ.

"విసుక్కుంటే లెక్కలు రావు." నవ్వుతూ అన్నాడు శ్యామ్.

"విసుగు కాకపోతే ఏమిటి? మూడు గొంటలనుండి ట్రై చేస్తున్నా ఈ లెక్క రాలేదు."

నోట్సు అతని ముందుకు తోసింది శోభ. శ్యామ్ దానిని పావుగంటలో సాల్వు చేసి శోభకు ఎక్స్‌ప్లెయిన్ చేశాడు. శోభ ఆశ్చర్యంగా అతని ముఖం వంక చూసింది.

"మీరు చాలా తెలివిగల వారండీ!"

"నన్ను అమాయకుడంటారు? తెలివిగలవాడంటారు? ఏది నమ్మాలో నేను?"

"ఒకరు చెప్పింది నమ్మటమే తప్పు మీ లాంటివారో మీకు తెలియదా?"

"ఎట్లా తెలుస్తుంది? మనసును సంపూర్తిగా అర్థం చేసుకోవటం ఎవరికిరం? మనను గురించి మనకు తెలియని సంగతులెన్నో మనలో దాగివుంటాయి. అవి ఇతరులకు తెలుస్తాయి."

శోభ ఆశ్చర్యంగా అతని వంక చూస్తూ కూర్చుంది. ఆ రోజు శోభ ఇంటికి వచ్చిన తరువాత అమృత,

"ఏం చేస్తున్నాడు కిశోర్!" అంది.

శోభ ఆ ప్రశ్న వినిపించుకోలేదు.

"అక్కయ్యా! శ్యామ్‌కు పెళ్ళయిందా?"

ఈ ప్రశ్న అమృతకు ఆశ్చర్యం కలిగించింది. పరీక్షగా శోభ ముఖంలోకి చూస్తూ "ఏం?" అంది.

అక్క తనను పరీక్షగా చూస్తుందని గమనించి శోభ లోలోపల చాలా సిగ్గుపడింది. పైకి నిర్లక్ష్యంగా నవ్వి,

"ఊరికే అడిగాను." అని అక్కడి నుండి వేరే గదిలోకి వెళ్ళిపోయింది.

అమృత అట్లాగే కూర్చుని శోభను గురించి ఆలోచించ సాగింది. ఆమె మనసులో ఒక వింత ఆలోచన మెరిసింది. నిజంగా అట్లా జరిగితే ఎంత బాగుండును? కాని....ప్రయత్నించాలి. అమృత మనస్సు ఉత్సాహంతో నిండిపోయింది.

మరునాడు భోజనాల దగ్గర మధు అన్నాడు,

"ఇవాళ నాకు సెలవు. మాటినీకి పోదామా? మంచి పిక్చరు?"

"ఏమిటి బావగారూ!" ఉత్సాహంగా అడిగింది శోభ.

"ఓ! తప్పకుండా వెళ్దాం. ఏం అక్కయ్యా!"

"మీ రిద్దరూ వెళ్ళండి. నేను రాను."

"అదేం?" ఆశ్చర్యంతో అడిగింది శోభ.

"అమృతకు సినిమాలంటే యిష్టంలేదు. అందులో యింగ్లీషు పిక్చరంటే మరీ......." మధు నవ్వాడు.

"కాని....నేనూ మానేస్తాను." శోభ కొంచెం విచారంగా అంది.

"ఎందుకూ? మీ రిద్దరూ వెళ్ళండి." బతిమాలుతున్నట్లు అంది అమృత.

"మనం వెళ్దాం శోభా!" మధుకూడా ఆ అర్ధ్రాగ్న్‌ స్నె బలపరిచాడు. శోభకు కూడా వెళ్ళాలనే వుంది. మధూ, శోభ మ్యాటినీకి వెళ్ళారు. వాళ్ళు వెళ్ళిన పావుగంటకు శ్యామ్ వచ్చాడు.

"శోభలేదా?" అమృత వంక చూస్తూ అడిగాడు.

"ఏం? శోభ లేకపోతే నీ కిక్కడ వుండ బుద్ధి కావటం లేదా?"

ఈ ధోరణికి శ్యామ్‌కు ఆశ్చర్యం కలిగింది. ఏం మాట్లాడక లేక ఆశ్చర్యంగా అమృత ముఖం వంక చూస్తూ కూర్చున్నాడు. అతని చూపులకు అమృత నవ్వుకుంది.

"సరే కాని కిశోర్! ఇన్నేంత కాలం ఇలా ఒంటరిగా వుంటావా? బాధగా లేదూ?"

"ఏం చెయ్యమంటావు అమృతా?" చాలా దీనంగా అడిగాడు శ్యామ్.

అమృత హృదయం వణికి పోయింది. ఆమె కళ్ళు అశ్రుపూరితాలవబోయాయి. అతి ప్రయత్నం మీద నిగ్రహించుకుని తేలికగా నవ్వింది.

"నువ్వు యువకుడివి. ఏం చెయ్యాలో నీకు తెలియదా?"

"నే నేం చెయ్యగలను? నే నేమీ చెయ్యలేను. నా జీవిత మిట్లా గడచి పోవలసిందే!"

అమృత తిరిగి కంపించింది. ఆమె మనసు వికలితంగా కలత పడింది. తనలో తనే అనుకుంది.

"భగవంతుడా! నా మనసును మరీ దుర్బలం చెయ్యకు. నేను ఎవరిని ప్రాణం కంటె ఎక్కువగా ప్రేమిస్తున్నానో వారి జీవితం సుఖమయం చేయగల శక్తి నాకియ్యి." శ్యామ్ కన్నీళ్ళతో అన్నాడు.

"నే నొకనాడు నా హృదయం విప్పి నీకు చూపించాను అమృతా! నేను నిన్ను హృదయపూర్వకంగా ఆరాధిస్తున్నాను. ఇంకొక వ్యక్తికి నా హృదయంలో స్థానం లేదు. నేను పెళ్ళి చేసుకున్నా నా భార్యను సుఖ పెట్టలేను. ఏం లాభం?"

అమృత తన హృదయ భారాన్ని అణచుకుంటూ ప్రశాంతంగా నవ్వింది.


## 1955 లో మీ అదృష్టము



ఏ పుష్పం పేరైనా తెలుపుతూ, మీ పేరు అడ్రెసు వ్రాసి మాకు ఒక పోస్టుకార్డు పంపితే మీకు రు. 1/4/ లకు పోస్టేజి వేరు. రాబోవు 12 నెలల ఫలితములు అనగా, వ్యాపారంలో లాభనష్టములు, సర్వీసు ప్రమోషన్, ట్రాన్స్‌ఫరు, జననం, వివాహం, సుఖము, జబ్బులు యున్నగు వివరాలు పంపుదుము. మీ రక్షణకు సూచనలు గూడ ఇవ్వబడును.

SHREE SWAMI SATNARAIN
JYOTIH ASHRAM (A.P.W.)
NAKODAR. (Pb.

"ఓ కవీ! పిచ్చి ఆదర్శాలన్నీ ఏకరువు పెట్టకు. జీవితంలో వంటరిగా ఎంత కాలమని వుండగలవు? నన్ను ఆరాధిస్తున్నావు సరే! కానీ, ఆ ఆరాధన నీ భార్యను ప్రేమించటానికి ఎట్లా అడ్డువస్తుందో నాకు అర్థం కావటం లేదు. మన ప్రేమ పవిత్రమైనది. పిచ్చిపిచ్చి మాటలతో దాని నపవిత్రం చెయ్యకు."

శ్యామ్ భారంగా నవ్వాడు.

"నేను నిన్ను ప్రేమిస్తున్నంతగా నువ్వు నన్ను ప్రేమించివుంటే ఈ విధంగా మాట్లాడగలిగేదానివి కావు అమృతా!"

అమృత పైకేమీ మాట్లాడలేదు. మనసులో అనుకుంది.

"పిచ్చి కిశోర్! ఈ లోకంలో నా సర్వస్వం నువ్వు కాబట్టే నేనింతగా మాట్లాడుతున్నాను. నాకంటే ఎక్కువగా నీ సుఖాన్ని కోరే వారెవరు? నీ మూలాన నాకూ, నా అంతరాత్మకూ ఎంత ఘోరమయిన యుద్ధం జరుగుతుందో, నేనెంత వ్యథ పొందుతున్నానో నువ్వేనాడైనా వూహించగలవా?"

అమృత ఎంతకూ మాట్లాడక పోవడంతో తిరిగి శ్యామ్ అన్నాడు.

"పోనీ, నేను పెండ్లి చేసుకుంటాననుకో! ఎప్పుడైనా నా భార్యకు నేను వేరొక వ్యక్తిని ఆరాధిస్తున్నట్లు తెలిస్తే ఆమె మనసుకు కష్టం కలుగదా?"

"నీ ఆరాధన నంత తేలికగా తీసికోని వ్యక్తి కాక విశాల హృదయం గల వ్యక్తిని పెండ్లి చేసుకో!" శ్యామ్ నవ్వాడు.

"ఒకరి హృదయం విశాలమైందో, సంకుచితమైందో తెలిసికోవటమెట్లా? పైన టిక్కెట్లు దానికేమీ అతికించి పెట్టలేదు. పైగా అదీ వుంది కానీ, అందుకు చాలా రోజుల పరిచయం కావాలి. అయినా సరిగా అర్థం చేసుకోవటం కష్టమే!....పోనీలే అమృతా! ఈ జీవిత మిట్లా గడచిపోవలసిందే!"

అమృత కొంచెం సేపాగి మెల్లిగా అంది.

"శోభతో నీకు చాలా రోజుల నుండి పరిచయమున్నదిగా! ఆమెను గురించి నువ్వే మనుకుంటున్నావో?"

శ్యామ్ వులికిపడ్డాడు.

"శోభా!?!" అత్యంతాశ్చర్యంతో అన్నాడు.

సరిగ్గా అదే సమయానికి శోభ లోపలికి వచ్చింది.

"అక్కేమిటీ? ఇద్దరూ చేరి నా మీద నేరాలు చెప్పుకొంటున్నారా?"

శ్యామ్ ఏదో మాట్లాడబోయాడు. అమృత సైగతో అతన్ని వారించి నవ్వుతూ అంది.

"నీకొంతే మరి! నువ్వు చాలా అల్లరి పిల్లవని చెప్తున్నాడు."

"ఏమండీ? నే నేం అల్లరి చేశాను?"

శ్యామ్ కు పాపం! ఏం మాట్లాడాలో తోచలేదు.

"అబ్బే! చాలా చలాకి అంటున్నాను."

"అమ్మ పెద్ద ముసలమ్మ!" అమృత నవ్వింది.

శోభ కూడా నవ్వి అంది.

"మీరు అమాయకంగా కన్పిస్తారు కానీ ఒక్కొక్కప్పుడు భలేగా మాట్లాడుతారు."

"ఇదెక్కడి కర్మండీ! నేను అమాయకుణ్ణని చెప్పుకోలేదు. తెలివిగలవాడినని చెప్పుకోలేదు. అన్నీ మీరే అంటున్నారు." అమృతా, శోభా ఇద్దరూ పకాలున నవ్వారు.

శ్యామ్ లేచి నుంచున్నాడు.

"మీ రిద్దరూ ఏకమై నన్ను హేళన చేస్తున్నారు. నేను వెళ్ళిపోతున్నాను."

శ్యామ్ నవ్వుతూనే వెళ్ళిపోయాడు. శ్యామ్ వెళ్ళిపోయిన తరువాత శోభ నవ్వుతూ అడిగింది.

"ఏమి టక్కయ్యా!"

"నువ్వు బలేదానివి శోభా!"

"ఏం?" "నే నేం చేశాను?"

"ఏమో? ఏం చేశావో? శ్యామ్ ఇవాళ వచ్చిన దగ్గర నుండి నిన్ను పొగడ్డంతోనే సరి పోయింది."

"అతనికి పొగడటంచేత నవునా?" శోభ నవ్వింది. అమృత కూడా నవ్వి అంది.

"ఏమో? రేపు చెప్తావుగా! అతన్నే కనుక్కో!"

"పో అక్కయ్యా! నాకేం పట్టింది?"

శోభ కొంచెం సిగ్గుతో నవ్వేసి హుషారుగా అక్కడి నుండి వెళ్ళిపోయింది.

మరునాడు శోభ శ్యామ్ ఇంటికి వెళ్ళేసరికి శ్యామ్ తన మామూలు పడక కుర్చీలో పడుకొని కళ్ళు మూసుకొని ఏదో పాడుకుంటున్నాడు. శోభ బిగ్గరగా నవ్వింది. శ్యామ్ కళ్లు తెరచి శోభను చూసి నవ్వాడు.

"....కూర్చోండి!"

శోభ కూర్చుని "బిగ్గరగా పాడండి! నేనూ వింటాను."

"నేను పాడితే మీరు పాడతారా?"

"అట్లాగే!"

శ్యామ్ పాడాడు. శోభను పాడమన్నాడు. శోభ పాటలు రావంది.

"మాట తప్పకూడదు!"

"నాకే పాటలూ రావు."

"వచ్చిందే పాడండి?"

శోభ నవ్వుతూ పాడింది. శ్యామ్ నవ్వి,

"ఆదేం పాట! తిన్నగా పాడండి!" అన్నాడు.

శోభ నవ్వింది.

"ఎన్ని డిగ్రీలు వంకరుందేం?"

శ్యామ్ శోభ ముఖం వంక చూశాడు. ఆమె కళ్లు చిలిపిగా వెలుగుతున్నాయి. శోభ తనను చాలా సార్లు పరిహాసం చేసింది. ఈ రోజు శోభను పరిహాసం చెయ్యాలనిపించింది.

"చెప్పమంటారా?"

"ఓ! చెప్పండి. లెక్కలు మాస్టరుగారూ!"

"నీ వయసుకూ నీ చేష్టలకూ మధ్యనున్న కోణమెన్ని డిగ్రీలో అన్ని డిగ్రీలు!"

శోభ వులికిపడింది. ఆమె ముఖం ఎఱ్ఱబారింది.

శ్యామ్ తన నీ విధంగా పరిహాసం చేస్తాడని శోభ ఎన్నడూ వూహించలేదు. విసురుగా కుర్చీనుండి లేచి వెళ్ళిపోబోయింది. శ్యామ్ కంగారుగా లేచి దారి కడ్డంగా నిల్చున్నాడు.

"అడ్డు లేవండి!" చాలా తీక్ష్ణంగా అంది.

"నన్ను క్షమించండి శోభారాణీ! మీ మనసు కింత కష్టం కలిగించాలని నే ననుకో లేదు...."

శోభ కళ్లు నీళ్ళతో నిండిపోయాయి. కోపంతో ఆమె పెదవు లింకా వొణుకుతూనే వున్నాయి. ఆ ముఖం వంక చూసేసరికి శ్యామ్ మనస్సు అదోక విధంగా విచలిత మయింది. అప్రయత్నంగా శోభను దగ్గరకు తీసుకున్నాడు. శోభ అతని హృదయం మీద వాలిపోయింది. శ్యామ్ చేతులామెను చుట్టేశాయి.

"శోభా!"

"శ్యామ్!"

"నేనొక పిచ్చివాడిని శోభా! నువ్వు నన్నంగీకరించగలవా?"

"నువ్వొక పవిత్రమూర్తివి శ్యామ్! నేను నీ దాన్ని కాగలుగుతే అదృష్టవంతురాలి నే!"

శోభ కండ్ల వెంబడి నీరు కారిపోతున్నాయి. శ్యామ్ తన చేత్తో ఆమె ముఖాన్ని పైకెత్తాడు.

"అబ్బ! నీ కండ్లు అచ్చంగా అమృత కళ్ళలాగే వున్నాయి. శోభా! కన్నీరు కార్చకు. ఈ కళ్ళలో కన్నీరు నేను చూడలేను."

శోభ వులికిపడింది. అతనికి దూరంగా జరుగుతూ అంది.

(మిగతా 60 వ పేజీలో)